క్లుప్తంగా

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

జగిత్యాల: వంట గది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని డీఈవో రాము అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ధరూర్ జెడ్పీహెచ్‌ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థులు రానున్న పదోతరగతి పరీక్షల్లో అత్యంత ప్రతిభ కనబర్చి 10 జీపీఏ సాధించాలన్నారు. తొలి మెట్టులో భాగంగా పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్‌ల రీడింగ్, రైటింగ్ నైపుణ్యాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఎంఈవో భీమయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాయికల్: ఇటిక్యాల గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. రేకుర్తికి చెందిన డాక్టర్ ప్రభాకర్ 150 మందికి పరీక్షలు నిర్వహించగా.. 36 మందిని ఆపరేషన్ల కోసం ఎంపిక చేసి రేకుర్తికి తరలించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మచ్చ శేఖర్, కార్యదర్శి కడకుంట్ల నరేశ్, కోశాధికారి కట్కం నర్సయ్య, ప్రోగ్రాం ఆర్గనైజర్ కొమ్ముల ఆదిరెడ్డి, సభ్యులు కనపర్తి శ్రీనివాస్, బోడుగం అంజిరెడ్డి, మండలోజు శ్రీనివాస, గ్రామ నాయకులు గంగారెడ్డి, కొల్లూరి వేణు పాల్గొన్నారు.

పంచాయతీల్లో నిధుల్లేక తిప్పలు



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

సారంగాపూర్: ఆగస్టు నుంచి గ్రామ పంచాయతీలకు ఎలాంటి నిధుల్లేక అన్ని చెల్లింపులు ఆగిపోయి ఇబ్బందికరంగా మారిందని, వెంటనే పెండింగ్‌లో ఉన్న చెక్కులను చెల్లింపులు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు గురువారం సారంగాపూర్ ఎంపీడీవో గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. నిధులు అందుబాటులో లేని గ్రామ పంచాయతీల్లో ఖర్చు చేసిన డబ్బులు చెల్లించలేని దయనీయ పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. మార్చి 1 వరకు పరిస్థితి ఇదేవిధంగా ఉంటే గ్రామ పంచాయతీలను నడపడం సాధ్యం కాదన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభం



ప్రారంభిస్తున్న విద్యుత్ అధికారులు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఒకేరోజు గురువారం ఆరు సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. భీమారం మండలం గోవిందారం, పసునూర్, మోత్కురావుపేట గ్రామాల్లో కోరుట్ల రూరల్ ఏడీఈ రఘుపతి ఆధ్వర్యంలో రూ.10లక్షలతో ఏర్పాటు చేసిన ఆరు సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. మన్నెగూడెం ఏఈ అశోక్, సబ్ ఇంజినీర్ హరిప్రసాద, సిబ్బంది యూసుఫ్, రాజేశ్, రాజేందర్, జలేందర్ పాల్గొన్నారు.

యూరియా కొరత తీర్చాలి

రాయికల్: మండలంలో యూరియా కొరతను తీర్చాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు ముత్యంరెడ్డి కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. యూరియా కొరతతో మండలంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించాలని, బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్న దుకాణ యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరారు.


నీటి తొట్టీలు ఏర్పాటు



కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గురువారం నీటి తొట్టీలు ఏర్పాటు చేశారు. వేసవిలో పక్షులు, జంతువుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసినట్టు మాజీ కౌన్సిలర్ పెండెం గణేశ్ తెలిపారు.

ప్రాజెక్టులో నీళ్లున్నా.. పంటలకందవు

- ఇదీ రాళ్లవాగు ప్రాజెక్టు రైతుల పరిస్థితి
- పంటలు వాడిపోతున్నాయని వాపోతున్న రైతులు
- నీటిని విడుదల చేయాలని వినతి



పుష్కలంగా నీళ్లున్న రాళ్లవాగు ప్రాజెక్టు

చింతకుంట తండా శివారులో బోరు బావిలో నీళ్లు రాక ఎండిన చేతికందే వరి పంట భూమి

కథలాపూర్: మండలంలోని 2వేల ఎకరాలకు సాగునీరందించే రాళ్లవాగు ప్రాజెక్టులో పుష్కలంగా నీళ్లున్నా.. పంటలకు సాగునీరందడం లేదని రైతులు వాపోతున్నారు. యాసంగి సీజన్ ప్రారంభంలోనే ఎండలు దంచి కొడుతుండడంతో నీళ్ల అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు మండిపడుతున్నారు. నీటి పారుదల శాఖ అధికారులు చొరవ చూపి ఆయకట్టుకు నీరందేలా చూడాలని కోరుతున్నారు.

మండల పరిధిలోని కాల్వలకు చుక్క నీరు కరువు

రాళ్ల వాగు ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా మండలంలోని భూషణరావుపేట, కథలాపూర్, చింతకుంట గ్రామాల్లోని 2 వేల ఎకరాల భూములకు నీరందుతుంది. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పెల్లి మండలం కోనాపూర్ గ్రామ శివారులో కుడికాలువ తరచూ కోతకు గురి కావడంతో శాశ్వత పరిష్కారానికి ఇటీవల రూ.20లక్షలు వెచ్చించి సైఫాన్ నిర్మించారు. ఇదంతా బాగానే ఉన్నా.. భూషణరావుపేట శివారులోని భూములకు నీరందకుండా కాలువను గుర్తుతెలియని వ్యక్తులు కొద్దిగా ధ్వంసం చేసినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రాజెక్టు నుంచి కుడి కాలువ ద్వారా నీరు వదిలినా.. వృథాగా ఒర్రెలోకి వెళ్తున్నాయని రైతులు పేర్కొన్నారు. కుడి కాలువ ద్వారా భూషణరావుపేట, కథలాపూర్ గ్రామాల భూములకు చుక్క నీరు రాని పరిస్థితి దాపురించిందని రైతులు మండిపడుతున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా.. చర్యలు తీసుకోవడం లేదు. రోజుల తరబడి కాల్వ ద్వారా నీళ్లు రాకపోవడంతో కాలువను నమ్ముకుని సాగు చేసిన వరి ఎండిపోవడం ఖాయమని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు త్వరగా స్పందించి చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

బోర్లు అడుగంటినయ్



రాళ్ల వాగు ప్రాజెక్టులో పుష్కలంగా నీళ్లున్నాయని, కుడి కాలువ ద్వారా నీళ్లు వస్తాయని ఎప్పటిలాగే వరి పంట సాగు చేసిన. కుడి కాలువ ద్వారా 15 రోజులుగా చుక్క నీరు రావడం లేదు. మూడు బోరు బావుల్లో కొద్దిగానే నీళ్లు వస్తున్నాయి. పంటలకు సరిపడేలా నీళ్లు అందడం లేదు. ఇప్పటికే మూడెకరాల్లో వరి పంట బీటలు వారింది. ప్రాజెక్టు నీళ్లు భూషణరావుపేట, కథలాపూర్, చింతకుంట గ్రామాలకు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి.

– గడ్డం శేఖర్‌రెడ్డి, రైతు, భూషణరావుపేట

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



రాళ్ల వాగు ప్రాజెక్టు నిజామాబాద్ జిల్లా పరిధిలో ఉంది. ప్రాజెక్టు కుడి కాలువ కథలాపూర్ పరిధిలో ఉండటంతో సమస్యగా మారింది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆయకట్టు రైతులకు నీరందించేందుకు కృషి చేస్తాం.

– ప్రశాంత్, నీటి పారుదల శాఖ డీఈ


దుబ్బ రాజన్న జాతరలో కార్యదర్శుల పాత్ర ప్రధానం



కార్యదర్శులతో సమావేశంలో అధికారులు

సారంగాపూర్: దుబ్బ రాజన్న జాతరలో భక్తులకు తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వాహణ వంటి విషయాల్లో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని ఎంపీడీవో చౌడారపు గంగాధర్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. మహాశివరాత్రి సందర్భంగా దుబ్బ రాజన్నలో జరిగే ఐదు రోజుల జాతర ఉత్సవాల్లో పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జాతరకు మండలంలోని 14 పంచాయతీ కార్యదర్శులకు వివిధ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలిపారు. వీరి పరిధిలో ఆరుగురు కారోబార్లు, 100 గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ సిబ్బంది జాతర ఉత్సవాల్లో పని చేస్తారని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ, క్లోరినేషన్ విషయంలో అశ్రద్ధగా ఉండకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. భక్తులకు తాగునీరందించడానికి 4 నీటి ట్యాంకులు అందుబాటులో ఉంచుతామన్నారు. చెత్త సేకరించడానికి 4 ట్రాక్టర్లు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఎంపీవో సలీం పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల్లో కనీసం 30 మంది కూలీలు ప్రతి గ్రామంలో పాల్గొనాలని ఎంపీడీవో కార్యదర్శులకు సూచించారు. నర్సరీల్లో మొక్కల ఎదుగుదల విషయంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.



భస్మంతో అలంకరణ

పెగడపల్లి: మండల కేంద్రంలోని రాజన్న ఆలయంలో శివరాత్రి సందర్భంగా నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు ఆకట్టుకుంటున్నాయి. రోజుకోరీతిన స్వామివారిని అలంకరిస్తూ పూజలు చేస్తున్నారు. గురువారం రాత్రి ఆలయ అర్చకుడు గుండి వినయ్‌శర్మ ఆధ్వర్యంలో శివలింగాన్ని భస్మంతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించగా.. శివ నామ స్మరణతో ఆలయం మారుమోగింది.

మెట్‌పల్లి సర్కిల్ పోలీసులకు ఎస్పీ ప్రశంసలు



సీఐకి ప్రశంసాపత్రం అందిస్తున్న ఎస్పీ

మెట్‌పల్లి: ఇటీవల దొంగతనాల కేసులను ఛేదించిన మెట్‌పల్లి సర్కిల్ పోలీస్ సిబ్బందిని ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు. వ్యవసాయ మోటార్లను చోరీ చేస్తున్న ముగ్గురిని పట్టుకొని వారి నుంచి రూ.6లక్షల విలువైన సొత్తును.. 40 చోరీలకు పాల్పడిన ఓ అంతరాష్ట్ర దొంగను పట్టుకొని రూ.11లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన నేర సమీక్షా సమావేశంలో సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సైలు కిరణ్‌కుమార్, అనిల్, రాజు, సిబ్బంది మారుతి, సంజీవ్, సాదునాయక్, కిరణ్, అనిల్‌కుమార్‌కు ప్రశంసపత్రాలను అందించి అభినందించారు.

మంత్రిని కలిసిన మార్కెట్ కమిటీ చైర్మన్



శ్రీధర్‌బాబుతో గోవర్ధన్

మెట్‌పల్లి: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ గురువారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్‌బాబును కలిశారు. మార్కెట్‌లో నెలకొన్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి సహకరించాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు. నాయకుడు వెంకటగిరి తదితరులున్నారు.

నేడు ధర్మపురికి మంత్రి రాక

ధర్మపురి: ధర్మపురి క్షేత్రానికి శుక్రవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రానున్నట్లు గురువారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ఎమ్మెల్సీ ప్రచార ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ధర్మపురిలోని బ్రాహ్మణ సంఘంలో ఉదయం 10 గంటల నుంచి నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులతో ముఖ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు, కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన దళితబంధు లబ్ధిదారులు



కథలాపూర్: మండలంలోని రెండో విడత దళితబంధు లబ్ధిదారులు హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితను గురువారం కలిశారు. శాసనసభ ఎన్నికలకు ముందు మండలంలో 60 మందిని రెండో విడత దళితబంధు పథకంలో లబ్ధిదారులుగా గుర్తించారన్నారు. జాబితాను అప్పటి వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు కలెక్టర్‌కు అందించారన్నారు. ఎన్నికల కోడ్ వల్ల నిధులు రాలేదని, ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్సీ కవితకు విన్నవించామన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తామని ఆమె హామీ ఇచ్చినట్లు లబ్ధిదారులు పేర్కొన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా కోరుట్ల ఆర్డీవో



ఆర్డీవోకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారులు

కోరుట్ల రూరల్: మండల ప్రత్యేక అధికారిగా ఆర్డీవో జీవాకర్‌రెడ్డి నియమితులయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో ఓదెల రామకృష్ణ, మండల పంచాయతీ అధికారి కృపాకర్, మండల పరిషత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ రాజన్న ఉత్సవ కమిటీలో చోటు

కథలాపూర్: వేములవాడలో శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 25 నుంచి 27 వరకు నిర్వహించే మహాశివరాత్రి జాతర ఉత్సవాలకు 29 మంది నాయకులతో ఉత్సవ కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో కథలాపూర్ మండలంలోని ఇద్దరు కాంగ్రెస్ నాయకులకు ఉత్సవ కమిటీలో చోటు కల్పించారు. కాంగ్రెస్ కథలాపూర్ మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్యకు స్థానం దక్కగా.. పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడిగా వెంకటేశ్



కార్యవర్గ సభ్యులు

సారంగాపూర్: మున్నూరు కాపు సంఘం మండల శాఖ అధ్యక్షుడిగా బాదినేని వెంకటేశ్(పెంబట్ల) ఎన్నికయ్యారు. గురువారం మండల మున్నూరు కాపుల సమావేశం మండల కేంద్రంలో నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా అత్తినేని శ్రావణ్‌కుమార్(లచ్చక్కపేట), అత్తినేని నరేశ్(పోచంపేట), ప్రధాన కార్యదర్శిగా బాస నాగేందర్(రేచపల్లి), కోశాధికారిగా రామగిరి రాజిరెడ్డి(కోనాపూర్), సంయుక్త కార్యదర్శిగా అయిత ప్రవీణ్‌కుమార్(పోతారం), కార్యదర్శిగా కొక్కు గంగారాం(సారంగాపూర్), గోపు మహేశ్(లక్ష్మీదేవిపల్లి), సభ్యులుగా బాదినేని శేఖర్(పెంబట్ల), బుక రవి(అర్పపల్లి), గౌరవ అధ్యక్షులుగా కోల శ్రీనివాస్, తేలు రాజు ఎన్నికయ్యారు. తొమ్మిది మంది ముఖ్య సలహాదారులుగా నియమితులయ్యారు.

ఇసుక డంప్ స్వాధీనం



ఇసుక డంప్‌ను సీజ్ చేసి స్వాధీనం చేసుకున్న ఆర్ఐ సురేశ్

మల్లాపూర్: వీవీరావుపేట శివారులో రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించి ఇసుక డంపులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ వీర్‌సింగ్ మాట్లాడుతూ.. ఇసుక అక్రమ రవాణాదారులు నిల్వ ఉంచిన ఇసుక డంపులను స్వాధీనం చేసుకొని పంచనామా నిర్వహించినట్లు తెలిపారు. వీవీరావుపేట శివారులో 15 ట్రిప్పుల ఇసుకను ప్రభుత్వ స్వాధీనంలోకి తీసుకున్నామన్నారు. గోదావరి నది, పెద్ద వాగు తీర ప్రాంతాల నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే వాల్టా చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఆర్ఐలు సురేశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత



లారీ వద్ద మైనింగ్ శాఖ ఏడీ, అధికారులు

కథలాపూర్: మండలం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని మైనింగ్ శాఖ ఏడీ జయ్‌సింగ్ గురువారం పట్టుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మండల టాస్క్‌ఫోర్స్ అధికారులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పర్యటించారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని పట్టుకొని పోలీస్ స్టేషన్ వద్ద ఉంచారు. ఆర్డీవో రామారావు, ఆర్ఐ నాగేశ్, హెడ్ కానిస్టేబుల్ లీలానాయక్, సుదర్శన్ పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

రాయికల్: ఆలూరు గ్రామ శివారులోని ఓ మామిడి తోటలో పేకాట ఆడుతున్న స్థావరాలపై గురువారం రాత్రి పోలీసులు ఆకస్మికంగా దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులో తీసుకొని వారి వద్ద నుంచి రూ.39,570నగదుతోపాటు కారు, మూడు ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు.

41 మందికి కు.ని చికిత్సలు

రాయికల్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో 41 మంది పురుషులకు డాక్టర్ యాకూబ్ పాషా ఆధ్వర్యంలో కు.ని ఆపరేషన్లు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ శశికాంత్‌రెడ్డి తెలిపారు. మెడికల్ ఆఫీసర్ సతీశ్, రవిశంకర్ పాల్గొన్నారు.

పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలి



బేటీ బచావో బేటీ పడావోపై అవగాహన ర్యాలీ

ధర్మపురి: పిల్లల ఆరోగ్యం, చదువులపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని మహిళా సాధికారత కేంద్రం టీమ్ గౌతమి అన్నారు. బేటీ బచావో బేటీ పడావో వారోత్సవాల్లో భాగంగా తిమ్మాపూర్, ధమ్మన్నపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలురు, బాలికలను సమాన దృష్టితో చూడాలని, ఎదుగుదలపై శ్రద్ధ తీసుకోవాలని కోరారు. సఖి 181, సైబర్ క్రైమ్ 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నంబర్లపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నీలిమ, కుసుమ, సిబ్బంది శ్రీనివాస్, మానస, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులున్నారు.

శివరాత్రికి ముస్తాబైన పెగడపల్లి రాజన్న



ముస్తాబైన ఆలయం

పెగడపల్లి: ఈనెల 24 నుంచి 27 వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పెగడపల్లి రాజన్న ఆలయం ముస్తాబైంది. ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఏర్పాట్లు పూర్తి

ఉత్సవాల సందర్భంగా వచ్చే భక్తుల కోసం ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ఆవరణలో చలువ పందిళ్ల, నీటి వసతితోపాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రామచంద్రం, ఉత్సవ కమిటీ సభ్యులు కోరుతున్నారు. 24న భూకలశ గణపతి పూజ, పుణ్యాహవచనం, 25న సామూహిక నవగ్రహ హోమాలు, కుంకుమ పూజలు, 26న స్వామివారి కల్యాణం, బిల్వపత్రి సమర్పితం, లింగోద్భవ దర్శనం, 27న బలిదానం, పూర్ణాహుతి, స్వామివారి రథోత్సవం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు గుండి శ్రీనివాస్‌శర్మ, వినయ్‌శర్మ తెలిపారు.

నిరుద్యోగులకు అండగా కాంగ్రెస్

రాయికల్: నిరుద్యోగులకు అండగా ఉంటున్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలుపునకు కృషి చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. గురువారం రాయికల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ దాసరి గంగాధర్, మాజీ సర్పంచులు ఎద్దండి భూమరెడ్డి, తంగెళ్ల రమేశ్, అత్తినేని గంగారెడ్డి, నాయకులు మహిపాల్‌రెడ్డి, తలారి రాజేశ్ పాల్గొన్నారు.

జగిత్యాలటౌన్: ఉత్తర తెలంగాణాలో లక్షలాది నిరుద్యోగులకు ఉద్యోగ అర్హత కల్పించిన ఘనత అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధివిధానాలపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్లు తాటిపర్తి విజయలక్ష్మి, జీఆర్ దేశాయ్, నాయకులు కొత్త మోహన్, పుప్పాల అశోక్, రేపల్లె హరికృష్ణ, రఘువీర్‌గౌడ్, బీరం రాజేశ్, లైశెట్టి విజయ్, ముఖేశ్ ఖన్న, పిప్పరి అనిత, చిట్ల లత తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా కృషి చేయాలి

మల్యాల: కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషి చేయాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గురువారం రాత్రి మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక సన్నాహక సమావేశం నాయకులు, కార్యకర్తలతో నిర్వహించారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి

ఇబ్రహీంపట్నం: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి చిన్నమైల్‌ను గెలిపించాలని గురువారం వేములకుర్తి గ్రామంలో నాయకులు ప్రచారం చేశారు. ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు మాలేపు శ్రీనివాస్, శక్తి కేంద్ర ఇన్‌చార్జి కోటగిరి వెంకటస్వామి, సీనియర్ నాయకులు కోటగిరి ప్రభాకర్, అరె రమేశ్, దొొట్టి రవి, కోటగిరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్: దూలూర్, బొమ్మెన గ్రామాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్యకు మద్దతుగా బీజేపీ నాయకులు గురువారం ప్రచారం చేశారు. మండలాధ్యక్షుడు మల్యాల మారుతి, నాయకులు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, గాంధారి శ్రీనివాస్, కాసోజి ప్రతాప్, మహేశ్, నరెడ్ల రవి, ఆనంద్‌రెడ్డి, మీస్‌రెడ్డి పాల్గొన్నారు.

పెగడపల్లిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు 1,602

పెగడపల్లి: ఈనెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ రవీందర్ గురువారం తెలిపారు. మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు 1,602 మంది, టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్లు 36 మంది ఉన్నారన్నారు. పోలింగ్ నిర్వహణ కోసం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్లో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బార్ అసోసియేషన్ మద్దతు కోరిన ఎమ్మెల్సీ అభ్యర్థి రవీందర్‌సింగ్

కోరుట్ల: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్సీ అభ్యర్థి, కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ కోరుట్ల బార్ అసోసియేషన్ సభ్యులను గురువారం కోరుట్లలో కలిశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాస్‌రావు, సెక్రటరీ సుతారి శ్రీనివాస్, కోశాధికారి రాజశేఖర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

అలరించిన వీడ్కోలు వేడుకలు

కోరుట్ల: పట్టణంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల వీడ్కోలు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కరస్పాండెంట్ నలువల శేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కొప్పుల శ్వేత, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.